# నూరేళ్ల పంట.....

కె. రామలక్ష్మి



చిన్నతనంలో రాధ చేసిన అల్లరిపనులు ఏ మగపిల్లలూ చేసి వుండరు. కోతి కొమ్మచ్చి లాడ్డంలో కుర్రాళ్ళని మించి చెట్లు ఎగబాకేది గోణీబిళ్ళ ఆడ్డంలోనే కాదు గోళీకాయి లాటలో కూడా ఆ వీధికుర్రాళ్ల నిట్టే ఓడించేది. సన్నటి కాళ్లూ పిలకజడలూ రెండు మోకాళ్ళ మీదా ఎప్పుడూ ఏవో దెబ్బలూ పట్టీలూ ...'ఈ రాధ ఎప్పటికేనా ఆడపిల్ల అవుతుందా!' అనిపించేది. అమ్మ కోప్పడ్డప్పుడు అటూ ఇటూ తిరగడానికి పోతే కూడా పరుగెత్తివచ్చే పెంపుడు కుక్క అంటే ఎక్కడలేని ప్రేమ రాధకి. ఎప్పుడేనా ఏ చెట్టుకిందేనా కూర్చుని పగటి కలలు కంటూ 'అమ్మా నాన్నల కంటే యీ కుక్క అంటేనే నాకిష్టం' అనుకునేది! ఆ తల్లీ, తండ్రీ అంత కట్టడి చేస్తున్నట్టు అనిపించేది. మంచి బట్టలు వేసుకోమని, చక్కగా తల దువ్వుకుని పువ్వులు పెట్టుకోమని సతాయించే అమ్మంటే ఎంత కోపమో రాధకి. 'అదంతా దండగ. ఏం తల దువ్వి పువ్వులు పెట్టుకోకపోతే మునిగిపోతుందా!'...జీవితం ఓరంగుల స్వప్నం. అదో పంచరంగుల సాహస యాత్ర. అందులో నేనే కథానాయికిని' అనుకుని తనలో తను నవ్వుకునేది. రాధ మహా మొండి ఘటం. అయినా అంతట్లో అమ్మా నాన్నా చేతులు కడుక్కోగలరా? వాళ్ళకి రాధంటే ఎంతో ప్రేమ. అందుకే ఈతల్లి ఎప్పుడు ఎదుగుతుందా? అని ఎదురు చూశారు.

రాధకి పదమూడో ఏడు వచ్చేసింది. చిన్నతనపు అల్లరి తగ్గింది. తొలిసారి రజస్వలైంది. ప్రాణం పోతుందన్నంత ఏడ్చింది. కాని అమ్మ పెద పండగ చేసింది! తొలిసారి అమ్మ బాడీ వేసుకోమన్నప్పుడు పెద్ద రాద్ధాంతం చేసింది. వోణీ వేసుకోనని, స్కూలుకే వెళ్ళనని హంగామా చేసింది. ఆ యేడే పరీక్ష తప్పిందికూడా. అమ్మ తిట్టడానికి బదులు నవ్వేసింది. "ఎప్పుడూ అన్నిటిలో నీదే ప్రధాన పాత్ర అనుకోకు చిట్టితల్లీ. నాటకంలో పక్క పాత్రలకి కూడా అప్పుడప్పుడు ప్రాముఖ్యం వుంటుంది." అంటూ ఓదార్చి వూరుకుంది.

ఎలాగో హైస్కూలు ముగించి కాలేజీ ప్రాంగణంలో అడుగుపెట్టింది. గొంగళి పురుగు కట్టిన గూటిని బద్దలు చేసుకుని కొత్త వన్నెల సీతాకోకచిలుక ఆ కాలేజీ కాంపౌండులో రెక్కలు సాచి ఎగిరింది. అస్తమానూ అందరూ చెప్పుకునే అబ్బాయిల కబుర్లు ఆసక్తిగా వింటూ 'ఇదంతా నిజమేనా? నా కొక్క బాయ్ ఫ్రెండు లేడేం! రాడేం!' అనుకుంటూ వుండగానే ఇంట్లో సంబంధాల వేట ప్రారంభించడం గ్రహించింది వూహల్లోనే అబ్బాయిలని, తన స్నేహితుణ్ని సృష్టించుకుని కలల్లో బ్రతుకుతూ కాలేజీ చదువు ముగించింది. పరీక్షలు ఎప్పుడయిపోతాయి. ఎప్పుడీ కట్టడి ముగుస్తుందా అని ఆత్రంగా ఎదురు చూసింది. పరీక్షలు అయ్యాయి. పాసయింది. 'అబ్బా! ఇంక చదవక్కరలేదు'

అన్న ఊహ రాగానే ఆమె మనస్సు దూది పింజెలా ఆకాశ మార్గాన పయనించింది.

వచ్చే పోయే పెళ్ళికొడుకుల మధ్య తన ఆత్మ ఘోషిస్తూందని అమ్మకేనా చెప్పలేకపోయింది రాధ. చివరికో అబ్బాయి—తల్లీ తండ్రీ లేరుట. ఓ అక్కగారుందిట. ఆస్థి అసలు లేదుట-చదువైతే బ్రహ్మాండంగా వుందిట - అంటూ అమ్మా నాన్నా చెప్పుకుంటూంటే వింది. 'అతనే కావాలి నాకు' అంటూ ఒకటికి వందసార్లు మనస్సులో కోరుకుంది. 'ఆస్థి లేకపోతే ఏం? అబ్బాయి బాగుంటే చూద్దాం. మంచి చదువుంది కదా!' అంటూ ఆ సంబంధంవైపు మొగ్గారు అమ్మ' నాన్న.

అబ్బాయి చూసుకుందు కొచ్చాడు. పేరు కృష్ణమూర్తి అని వినగానే 'ఆ దేముడే కలిపాడు మమ్మల్ని' అనుకుంది రాధ. లేకపోతే పేర్లు చూడు ఎంత ముద్దుగా కుదిరాయో! అంటూ మురిసి పోయింది. కృష్ణమూరికి పేరుకి తగ్గ చిలిపితనం లేదు. రాధని కాస్త తీక్షణంగా చూశాడు. కళ్ళెత్తి అతన్ని చూసిన రాధ మరుక్షణంలో కళ్ళు దింపేసింది. అబ్బ. ఎంత తీవ్రంగా వుందా చూపు.' అనుకుంది. మంచి రచయిత సునిశిత దృష్టిలా వుంది. మంచి కవి ఆలోచనలో మునిగి కవితా కన్యని చూస్తూ ఎటు చూస్తున్నదీ తెలియనట్టు వుందా చూపు, అనుకుంది. ఆ క్షణంలో కృష్ణమూర్తిని మనసారా ప్రేమించేసింది రాధ పెద్ద వాళ్ళు చాలా రోజులు ఆలోచించారు. వెనక ఆస్తి లేదని ఒక అనుమానం. చదువుందికదా అని ఒక ధైర్యం. కట్నం అడగలేదని ఒక అనుమానం. అడగలేదంటే గౌరవనీయుడని ఒక నమ్మకం..చివరికెలాగైతేనేం సంబంధం ఖాయంచేశారు. పెళ్ళిరోజు తనకోసం స్వర్గద్వారాలు తెరిచినరోజు అని ఆనందించింది రాధ. స్నేహితురాళ్ళంతా 'ఈ పెళ్ళికొడుకులో ఏంచూసి ఒప్పుకున్నావే' అంటూ వేళాకోళాలు చేశారు. 'నే సరిగ్గా యిలాగే వుండాలని కోరుకునేదాన్ని - మగవాడినై వుంటే' అంది రాధ.


పెళ్ళి అయిపోయిన నాల్గోరోజు ఉద్యోగానికి కబురొచ్చింది రాధకి. నవ్వుకుంది. 'ఇప్పుడు నాకీ ఉద్యోగం ఎందుకు?' అనుకుంది. కృష్ణమూర్తి కళ్ళల్లో గూడు కట్టుకుని కాపురం చేస్తూంది. కృష్ణమూర్తి రిసెర్చి సంస్థలో ఉద్యోగంలో చేరాడు. తన ఉద్దేశ్యాలను ప్రోగుచేసి వ్యాసాలు రాయాలని తాపత్రయ పడేవాడు. అవి తిరుగు టపాలో వచ్చేస్తూంటే ఓ రెండు రోజులపాటు మూర్తీభవించిన నిరాశామూర్తి అయి యింట్లో తెగ విసుక్కునేవాడు...స్నేహితులతో అటూ యిటూ తిరగడం, లేటుగా యింటికి రావడం, మనస్సు బాగులేదన్న సాకుతో సాయంత్రంపూట కాస్త తాగడం...అన్నీ రాధకి వింతగా తోస్తున్నాయి. రాధ కడుపుతో వుంది. తను కన్న కలలన్నీ - ఓ దారిన పడ్డాయన్న సంతోషం ఆమె నొకచోట నిలవనివ్వడంలేదు ... పురుటికి యింటికి వెళ్ళింది. రోజూ ఏదో టైములో చూసి వెడుతూండేవాడు కృష్ణమూర్తి. రాధకి ఆడపిల్ల పుట్టింది. తొలిసారి పాపకి పాలిస్తూ కూర్చున్న రాధని చూసి కృష్ణమూర్తి కళ్ళు-క్రొత్తగా మెత్తపడ్డాయి. భర్త కళ్ళనిండిన ఆ చూపు, పాలు కుడుస్తున్న తన పాప, యివన్నీ తల్చుకుంటూ...'కావ్యమైన ఏదో మైకంలో మునిగిపోతానేమో' అనుకుంది రాధ. ఆమె కిప్పుడు తమ ప్రేమ సంపూర్ణమైనట్టు అనిపించింది.

రాధ కూతురికి అందమైన పేరు పెట్టాలనుకుంది. కాని కృష్ణమూర్తి ఎప్పుడూ చూడని తన తల్లి పేరుకు బ్రతికి ఉన్న ఆమె పేరు కలిపిపెట్టాలని పెట్టేశాడు. వెంకటరత్నకుమారి అయ్యింది రాధ కల. రత్న పుట్టిన మూడునెలలూ ఏడుస్తూనే వుంది! కృష్ణమూర్తి వ్యాసాలు ఒకటీ అరా అచ్చవడం ప్రారంభించాయి. అదే సంస్థలో పైపైకి పోతున్నాడు... రాధకి యిల్లు కొనుక్కోవాలని, దాన్ని అందంగా అలంకరించాలని పెద్దతోటవేసి అందరికళ్ళూ దానిమీదే పడేలాచేయాలని ...ఏమేమిటో కలలు...రాధ మళ్ళీ పురిటికి వెళ్ళింది. అబ్బాయి పుట్టాడు. యింకేం లోటు? వంశోద్ధారకుడు పుట్టేశాడు. రాధ యింటికలలు కాస్త వెనక్కి వెళ్ళాయి. 'వీణ్ని డాక్టర్ని చెయ్యాలి. ఇంజనీరుగా తయారవ్వాలి...' అంటూ కొత్త కలలకు నాంది వేసింది రాధ.

కుర్చీలో కూర్చుని బాబుకి పాలిస్తూంటే రత్న కాళ్ళు పట్టుకుకూర్చుని వేలు నోట్లో పెట్టుకుంది దూరంలో తీవ్రమైన ఆలోచనలు బుర్రలోనూ, దట్టంగా సిగరెట్టు పొగా బుర్ర చుట్టూ తెర కప్పేస్తూంటే యీ దృశ్యం మబ్బు తెరలోంచి చూస్తున్నట్టు చూస్తున్నాడు కృష్ణమూర్తి. 'అలా వేలు అలవాటు చేసుకోనివ్వకు' అన్నాడు. 'నేనేం పెట్టుకోమన్నానా?' అంది రాధ... 'వీడూ రత్నలా ఏడిస్తే నే నిల్లువదిలి పారిపోతాను' అన్నాడు కృష్ణమూర్తి. ఈ మాటన్నందుకు దుఃఖం వచ్చింది రాధకి. రెండు రోజులు కృష్ణమూర్తితో మాట్లాడలేదు. మనస్సు గాయపడడమే కాదు...విదిలించేసినట్టు అయింది. చేతకాని ఏదో కోపం కట్టలు తెంచుకుంది. కృష్ణమూర్తి దెబ్బతిన్నట్టు బాధపడ్డాడు. తనని నెట్టేసినట్టు, తనేదో తప్పుచేసినట్టు బాధపడ్డాడు.

పిల్లలూ, భార్యాభర్తల విసుగులూ ఒకరేటులోనే త్వరత్వరగా ఎదుగుతున్నాయి.

కృష్ణమూర్తికి పిల్లలంటే విసుగు. 'ఎక్కడ పడితే అక్కడే వెధవ బొమ్మలూ, గుడ్డలూ,' అంటూ మండిపడుతూ యింట్లోకి వచ్చేవాడు.



కూర్చుని రాసుకుంటున్నప్పుడు పిల్లరి గోల భరింపరానిదైంది. ఏదేనా రాసుకోదలిస్తే...ఆఫీసులోనే కూర్చుని పూర్తి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. యింటికి ఆలస్యంగా రావడం మొదలు పెట్టాడు...సరదాగా ఎక్కడికి వెళ్ళాలన్నా 'పిల్లలో' అంటూ అడిగే పెళ్ళాం అంటే ఒళ్ళు మండిపోతూంది. పోనీ అని ఏక్కడికేనా బయలుదేరినా...దారిపొడుగునా గొడవ. రాధకి తలనొప్పి కారెక్కితే తలనొప్పి. బాబుకి పెట్రోలు వాసన పీల్చుకుంటేనే డోకులు...

రోజులు గడిచినా సమస్యలు పరిష్కారం కావడంలేదు. ఇద్దరు పిల్లల్ని స్కూల్లో వేసినా యింట్లో వాతావరణం మారలేదు...వయస్సుతో పాటు కృష్ణమూర్తి వయస్సు తగ్గుతోంది. బట్టలంటే కొత్త ఉత్సాహం, అందంగా ఉండాలని శ్రద్ధ తీసుకోవడం ... చూసీచూడనట్లు చూసేది రాధ. వయస్సుకంటే ముకదే రాధవయస్సు పెరిగిపోతోంది. పాలు తాగడం మానేసినా ఒళ్ళు సడలింది. చీరకట్టులో, అలంకరణలో శ్రద్ధకంటే పిల్లల తిండితిప్పలమీద భర్తకు అధికం అవుతున్న రాబడిమీద, ఎక్కువ శ్రద్ధ కల్గుతోంది: అదే కదా-భవిష్యత్తుని బంగారం చేసేది?

పైకి చూడ్డానికంతా ఎంతో బాగుంది. కృష్ణమూర్తికి బాధ్యతగల ఉద్యోగంతో పాటు గౌరవం, హోదా, దానితోపాటు దర్పం పెరిగాయి. అడపా తడపా కాన్ఫరెన్సులనీ, సెమినార్లనీ టూర్లు వెడుతున్నాడు. వస్తున్నాడు. ఒక్కొక్కప్పుడు రాధకో చీరో, సెంటో తెస్తూనూ వున్నాడు. రాధ యిల్లూ వాకిలీ అతి శ్రద్ధగా చూసుకుంటూ పిల్లలు రేంకులు కిందికి దిగకుండా శ్రమపడుతూ...అదే తన బాధ్యతగా వుంటూనేవుంది.

ఎంతో సవ్యంగా సాగిపోతూన్న సంసారయాత్రకి ఆ సెలవుల ముందెందుకో సడెన్ బ్రేకు పడింది... కృష్ణమూర్తి కాన్ఫరెన్సుకి వెళ్ళాడు వారం రోజులు. ఊటీలో చక్కని వాతావరణం సెమినార్లలో పొగడ్తలు. తన వ్యక్తిత్వం ఆరంగుళాలు పెరిగినట్టయింది సడెన్‌గా–కృష్ణయీర్తికి. అదే సెమినార్‌లో ఎంతో చక్కని పేపర్ చదివిన రేవతి అతన్ని ఆకర్షించింది. అందం. దానికి తోడు తెలివి. కృష్ణమూర్తి తలమునకలుగా ప్రేమలో పడ్డాడు...

పెట్టెడు మాసిన బట్టలతో, పుట్టెడు క్రొత్తకోర్కెలతో యింటికి వచ్చాడు... ఆ పూటే రాధతో చెప్పేశాడు. తను యింకొకరిని ప్రేమించునని. కాన్ఫరెన్సుకి క్రొత్త వెల్గుతెచ్చిన ఒకతె తనకి తెలియకుండానే తన మనస్సు దోచుకుందనీ – ఇదంతా యథాలాపంగా జరిగిపోయింది గాని ద్రోహం చేయాలని కాదనీ ... చెప్పాడు.

అంతా చెప్పి చెప్పి నేను రేవతిని మనసారా ప్రేమిస్తున్నాను' అంటూ ముగించాడు!

వింటూనే అలా బొమ్మలా కూర్చుంది రుధ. గుడ్డికళ్ళతో కూర్చున్న గది కలియచూసి గోడలమీద తన కిష్టమైన బొమ్మలు...కదుపుతూ వున్నప్పుడు సుఖంగా వుంటుందని కొనుక్కున్న వాలుకుర్చీ...అన్నీ అక్కడే వున్నా రాధకి మసక మసకగా వుండి ఏమీ కన్పడనే లేదు.

"మనిద్దరికీ యింక పడదు. నీకు నేనంటే ప్రేమలేదు. ఇది మనిద్దరికీ మంచిది" అంటూ పుస్తకంలో తల దూర్చాడు.

మాట్లాడకుండా లేచి పడకగదిలోకి వెళ్ళిపోయింది రాధ. లైటు వేసుకో బుద్ధికాలేదు. ఆ చీకట్లోనే మంచంమీద పడుకుంది పిల్లలు నిశ్చింతగా నిద్రలో వున్నారు. ఇంట్లో రేగిన తుఫాను వాళ్ళకి తెలియనేలేదు. చాలా సేపయ్యాక గాని కృష్ణమూర్తి గదిలోకి రాలేదు. వస్తూనే ఆ పెద్ద మంచంమీద ఎప్పుడూ తను పడుకునేవైపు పడుకున్నాడు. వత్తిగిలి ఓ చేయి చాపి రాధని అందుకుంటూ 'రాధా' అన్నాడు వినీవినబడనంత నెమ్మదిగా. తాగిన విస్కీ గుప్పున వాస వేసింది. 'నీకు యిల్లూ వాకిలీ కావాలి. పిల్లలు కావాలి అవన్నీ నువ్వే తీసుకో. నాకింకా ఏదో కావాలి.' అంటూ మళ్ళీ మాట లేకుండా – తాగినవాడి నిద్రకి ఒరిగాడు – ఒళ్ళు తెలియకుండా.

ఉదయాన్ని లేస్తూనే రాధ ఉలిక్కిపడి మంచంమీద కూర్చుంది. కూర్చుని జ్ఞాపకంచేసుకుంది. కడుపులోఏదోదేవేసినట్టు అయింది. గబగబ లేచి వంటింట్లో తలదాచు కుంది. అంతా అయిపోయింది. యిది ప్రణయకలహం కాదు పూర్తి ఎడబాటు. ఇది చిలిపి తగువు కాదు. శాశ్వతమైన విడిబాటు. ఇది గుంభనగా లేచిన కెరటపు పొంగుకాదు. ఉవ్వెత్తున ఉప్పొంగిన ఉప్పెన. దీనికి వేర్పాటే విరుగుడు. యింక దారి లేదు. వంట ఇంట్లో గోడ కానుకుని పడికిపోయింది రాధ. అమ్మకి నాన్నకి ముఖం ఎలా చూపించాలి! అందరికీ ఏమని చెప్పాలి? పిల్లలేమైపోతారు? తన గతేమిటి?... ఆలోచనలు ఈ దెళ్లలా ముసురుతున్నాయి. పొయ్యిమీద పొంగిపోతున్న పాలు కూడా కనపడ్డంలేదు రాధ నీళ్ళు కమ్మిన కళ్ళకి.

"నేనీరోజు ఆమెయింటికి వెళ్ళిపోతున్నాను రాధా మళ్ళీ వచ్చి వివరంగా మాట్లాడతాను" అంటూ పిల్లలు లేవకుండానే చిన్న పెట్టె సర్దుకుంటున్న కృష్ణమూర్తినిచూసి పక్కనే నిలబడిపోయింది రాధ. ఏడ్చినట్టు అతని కళ్ళు ఎర్రగా వున్నాయి.

"నే చేసిన పొరపాటేమిటి? నేనేం చేశానని ఇలా చేస్తున్నారు?" నిలదీస్తున్నట్టు అడిగింది.

"నువ్వేం చెయ్యలేదు రాధా. నువ్వేం తప్పు చెయ్యలేదు "

"మనం ఎంతో సుఖంగా ఉన్నాం. గడచిన రోజులు మరచిపోయారా?"

"నిజమే. అవి గడచిపోయిన రోజులని నువ్వే అంటున్నావు కదా!"

"మరెందు కిలా చేస్తున్నారు? ఏం జరిగిందని!" వస్తున్న ఏడుపు ఆపుకుంటూ గట్టిగా అడిగింది రాధ.

"నువ్వు. నువ్వు మారిపోయావు. ఈ పిల్లలు... యీ యిల్లు... నా కళ్ల ముందే నే కోరుకున్న సుందర దృశ్యం మారిపోయింది...''

"ఎవరో ఒకళ్ళు యిల్లూ వాకిలీ చూడాలికద. ఎవరో ఒకరు పిల్లల్ని చూడాలి కద" కోపంగా అంది రాధ.

"నువ్వు అది బాగానే చేశావు కద" అంటూ గట్టిగా చప్పుడు చేస్తూ పెట్టె మూశాడు.

"నాకదే యిష్టం అనుకున్నారా? ఈ నాలుగ్గోడల మధ్య నల్గిపోతూ, ఎడతెగని చాకిరీతో సతమతమైపోతూ యిలా మగ్గిపోడమే – నాకిష్టం అనుకున్నారా...మీరలా సభలూ సమావేశాలూ అంటూ– కంటికింపైన ఆడదికనిపిస్తే–పక్కలోనికి లాక్కుంటూ..." కోపంతో రాధ గొంతు ఒణికింది.

"రాధా. నేనే కావాలని ప్రేమలో పడ్డా ననుకుంటున్నావా?"

"మరెందుకు పడ్డారు?"

"సరే... పడ్డాను... పడ్డాను. సరేనా?..." విసుగ్గా అరిచాడు.

"మన కింకో దారి చూడలేరా?" బాధగా అడిగింది. "నాకు మీరంటే ఎంత ప్రేమో గ్రహించలేదా?" ప్రాధేయ పడింది.

కృష్ణమూర్తి కిదంతా ఒంటికి కారం రాసుకున్నట్టుంది.

"నాకీ యిల్లూ వద్దు వాకిలీ వద్దు. నీ ప్రేమా వద్దు. నా కిక్కడింక ఊపిరి సలపదు." అంటూ పెట్టె ఓ చేత్తో అందుకుని రాధ ముఖంలోకి చూశాడు. "నువ్వే మీ నాన్నగారితో చెప్పి లాయరుకి చెప్పమను," అంటూ మరి మాట్లాడకుండా బయటికి నడిచాడు.

బొమ్మలా నిలబడిన రాధకి కొంగు పట్టి లాగుతున్న బాబు కనబడలేదు.

ఎలాగో గుండె దిటవుచేసుకుని రోజులూ వారాలూ నెలలూ దొర్లించింది. పిల్లల యక్షప్రశ్నలు, తెలిసిన వాళ్ళ దొంగ చూపులు, అడిగీ అడగనట్టు అడిగే చుట్టాల కుతూహలం – రాధ ప్రాణాలు తోడుతున్నాయి. అయినా పళ్ళు గట్టికరిచి, ఆర్నెల్లు గడిపింది. తరగని పగళ్ళు, దీర్ఘరాత్రులూ రాధ ఆరోగ్యంమీద ముద్రలు వేస్తున్నాయి. కళ్ళకింది నల్లని చక్రాలు, ఏ క్షణాన్నయినా వర్షించడానికి సిద్ధంగా వున్నట్టుండే కళ్ళూ రాధ పడుతున్న మానసిక వ్యధని చెప్పక చెపుతూనే వున్నాయి. డబ్బు యిబ్బంది లేకపోవడం మినహా ఏమిటో లోటు. పిల్లలమీద ప్రేమ ద్వేషంగా మారిపోతున్నా, తన చేతకానితనం వెక్కిరిస్తున్నా మనస్సు స్తబ్దత నుండి తేరుకోవడంలేదు.

ఆ రోజు స్నేహితురాలు అనసూయ బలవంతంమీద పిల్లల స్కూల్లో టీచింగుకి ఒప్పుకుంది. గడవని పగళ్ళు ఇలాగేనా త్వరగా గడిచిపోతాయని భ్రమ పడింది రాధ. ఎంత కాదనుకున్నా ఉద్యోగంతోపాటు రాధకి కాస్త ఉత్సాహం కల్గడం మాట మటుకు నిజం. మళ్ళీ చదువుకునే రోజుల్లోలాగా-ముస్తాబయి టైముకి బయలుదేరడం ఏదో తెలియని తృప్తి నివ్వసాగింది. పిల్లలుకూడా యిప్పుడంత విసిగిస్తున్నట్టు అనిపించడం లేదు. ఆరోజు జీతం పర్సులో పెట్టుకుని చాలా ఉత్సాహంగా బజారునపడింది రాధ. తన సంపాదన. తన కిష్టమైనవన్నీ పిల్లలకి కొనుక్కుని ఆ పేకెట్లు పట్టుకుని గబగబ నడుస్తూంది. పేవ్‌మెంటుకి దగ్గరగా కారాగడం గాని, కృష్ణమూర్తి దిగడంగాని చూడనేలేదు రాధ.

"బాగున్నావా?" అంటూ ఎదురుగా నిలబడ్డాడు.

ఓ క్షణం నోటమాట రాలేదు రాధకి.

"కనిపించడం లేదూ?" అంది లేని ఉత్సాహాన్ని గొంతుకలోకి తెచ్చుకుంటూ.

"మీ నాన్నగారు లాయరుని చూశారా?" వినీ వినబడనంత నెమ్మదిగా అడిగాడు.

"లేదు, మీరో?" అడిగింది.

"లేదు. మనం ఆ విషయాలు మాట్లాడుకుంటే ఎలా వుంటుంది?" అడిగాడు.


"బాగానే వుంటుందేమో." అంది అనుమానంగా.

రాధ చేతిలో పేకెట్లు అందుకుని కారుకేసి నడిచాడు కృష్ణమూర్తి. బొమ్మలా అతనివెంట నడిచింది. మర్యాదగా కారు తలుపు తెరిచి పట్టుకున్నాడు కృష్ణమూర్తి. కారు స్టార్ట్ నేస్తూ 'ఎవరో ఒకరం కోర్టు కెక్కాలి కదూ?' అన్నాడు.

"నా కిష్టం లేదు. మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోవాలంటే – చేసుకోండి," అంది రోడ్డుమీద నడుస్తున్న జనప్రవాహాన్ని చూస్తూ.

"నాకు మళ్ళీ పెళ్ళిచేసుకోవడం యిష్టంలేదు" చాలా కామ్‌గా అన్నాడు కృష్ణమూర్తి.

"మరి?" ఆశ్చర్యంగా అడిగింది రాధ.



"మైగాడ్! నాకేం కావాలో నాకే తెలియదు. నేనిలా కారు నడుపుతూ చెప్పలేను" అంటూ కారు స్పీడు ఎక్కిం చాడు.

"ఎక్కడికి?"

కృష్ణమూర్తి మాట్లాడకుండా తన అక్కగారింటికి తీసుకెళ్లాడు కారు.

"ఇక్కడి కెందుకు? నన్ను యింట్లో దింపండి" అంది రాధ.

"అక్కయ్యా పిల్లలూ వూళ్ళోలేరు." అంటూ జేబులోంచి తాళాలుతీసి తలుపు తెరిచాడు.

రాధ మనస్సులో ఏదో తెలియని ఆందోళన ప్రారంభం అయింది. తలుపులు తెరుస్తూ తిన్నగా పడకగదికి దారి తీశాడు కృష్ణమూర్తి 'ఇక్కడ కూర్చుని మాట్లాడుకుందాం' అంటూ.

గది మధ్య నిలబడి కలయచూసింది రాధ.

''మనం యిక్కడేం మాట్లాడుకోగలం?" అంది రాధ.

ఎంత దాచుదామన్నా ఆమె కళ్లల్లో చిలిపితనం దాగలేదు. వద్దన్నా పెదవులు చిరునవ్వుతో విచ్చుకుంటూనే - వున్నాయి.

ఇద్దరూ ఒక్కసారే నవ్వేశారు.

కృష్ణమూర్తి రాధని దగ్గరకి లాక్కున్నాడు. ఊపిరి సలపనంత గట్టిగా కౌగలించుకున్నాడు. ఆమె ముఖాన్ని ముద్దులతో నింపేశాడు. ఆమె పెదవులపై పెదవులుంచి ఎక్కడో మునిగిపోతున్న వాడంత ఆత్రంగా ముద్దు పెట్టుకున్నాడు. రాధకి తెలియకుండానే ఆమె చేతులు అతని మెడను పెనవేసుకున్నాయి ఇద్దరూ మంచంమీదికి చేరారు. వారి ప్రేమకి అవధులు చెరిగాయి. హాయిగా ఆనందంగా ఒకరినొకరు పెనవేసుకుని కలిశారు. ఒకరినొకరు పూర్తిగా తెలుసుకున్న వాళ్ళు అందుకే అరమరికలులేక ఆనందించారు.

రాధ నుదుట పట్టిన చిరుచెమటలు తుడుస్తూ "నువ్వెంత అందంగా వున్నావో... నేను మరిచేపోయాను" అన్నాడు కృష్ణమూర్తి.

"మీరు మటుకు! ... ఎటొచ్చీ అలవాటు యీ కొత్తదనానికి ముసుగు వేసింది కాబోలు," అంది నిట్టూరుస్తూ రాధ.

చెరిగిన జుట్టు, చెదరిన చీర సవరించుకుంటూ "పిల్లలు ఒక్కళ్ళూ వుంటారు. నేను వెళ్లాలి" అంటూ లేచింది.

అమాంతం రాధని కౌగిట చేరుస్తూ "రాధా మళ్ళీ మనం కలిసి బ్రతకడానికి ప్రయత్నిద్దామా?'' రాధ చెవిదగ్గరగా నోరుపెట్టి అడిగాడు

"మరి రేవతి?' అడిగింది.

''నిన్ను...నిన్ను నేను మరిచిపోలేను రాధా'' బాధగా అన్నాడు.

'నాకుమటుకు?...కాని లాభంలేదండీ మళ్లీ కథ మళ్లదని ఏమిటి గ్యారంటీ... పెళ్లి... పెళ్లి అనేసరికి అసలు స్వంత రూపు పోతుంది ఆడదానికి... ఓ వంట మనిషి, ఓ చాకలిది, ఓ పనిమనిషి, ఓ పెళ్లం, ఓ తల్లి, యీ పాత్రలెవరేనా పోషించవచ్చు జీవన నాటకంలో. అందుకే మన ప్రత్యేకత పోయింది. చివరికి భర్తా చేయి వదిలేస్తాడు!" దీర్ఘంగా నిట్టూరుస్తూ అతని చేతులు విడిపించుకుంది రాధ.

"నిజమే. మరి మొగుడైతే మటుకు ఓ మిషనుగా తయారయిపోడం లేదా? డబ్బు తెచ్చేయంత్రం, యింట్లో అందరూ అన్నిటికీ పీడించే ప్రాణి. నువ్వారాధించి చేపట్టిన కన్నెవధువు ఎలా రూపాంతరం చెందుతుందో వూహించావా? ఎంతసేపూ యిల్లూ, వాకిలీ, పిల్లలూ... హోదా... అంతేగాని సంపాదించేవాడిమీద ప్రేమ ఏమైపోయిందో మరి? మైగాడ్. పిల్లలు! ఎప్పుడూ పిల్లలు: పిల్లలు. యింకోటి వుండదామె బుర్రలో. నువ్వు తలబద్దలు కొట్టుకురాసిన ప్రత్యేక వ్యాసం గురించో, సమస్య గురించో చెప్తాంటే 'ఈ రోజు బాబు ఏంచేశాడో తెలుసాండీ' అంటూ మొదలు...యిది న్యాయంగా తోస్తుందా నీకు? భార్యలు కొంపల్లో కూర్చుని సతమతమైపోతున్నారన్న కబుర్లింక చెప్పకు!'గట్టిగా అరిచాడు కృష్ణమూర్తి.

"నే వెడతాను." నెమ్మదిగా అంది రాధ.

"నే నన్న దాంట్లో తప్పేముంది రాధా? అంతా నిజమేకదూ!"

"నిజమే. అంతా నిజం పెళ్లి అన్నది శుద్ధ దండుగ."

ముఖం పక్కకి తిప్పుకుంది రాధ. "అయితే పెళ్లి అక్కరలేకుండా మీ ఆత్మాభిమానానికి, మీ ఉత్సాహానికి ఆలంబనంగా మాత్రమే నిలిచే అమ్మాయిని చేరదీయండి. ఆమెకేనా కడుపు రాకుండా జాగ్రత్తపడండి!" అంటూ గదిదాటి బయటికి వచ్చింది రాధ.

"రాధా ఆగు. నా మాట విను" అంటూ కృష్ణమూర్తి హాల్లోకి వచ్చాడు.

అక్కడేవున్న సోఫాలో కూలబడింది రాధ.

"నే చెప్పేది కాస్త విను రాధా, నేనింకో స్త్రీని నీలా చూడలేను నేను నిన్నే ప్రేమించగలను. నిన్ను గురించే ఆలోచించగలను. నీ గురించే బాధపడ కలను. నేనేం చేస్తున్నా నా మనస్సులోంచి నువ్వు పోవు. నువ్వు లేకపోతే నాకేదీ ఆనందం యివ్వదు. నువ్వూ పిల్లలూ లేకుండా-నాకు విశ్రాంతి లేదు. నువ్వు లేకపోతే నాకు తీయని బాధా లేదు. నేనలా నీకు దూరంగా వెళ్ళిపోలేను. ఇప్పుడది నా కర్థం అయింది."

రాధ కళ్ళు వర్షిస్తున్నాయి. ఆమె గుండెలు గూడుకట్టుకున్న దుఃఖంతో ఎగసెగసి పడుతున్నాయి.

"రాధా ఏడవకు. ఏడవకు రాధా. నేను చూడలేను. డామిట్. నువ్వు నాలో భాగానివి. నువ్వేడిస్తే నాకూ

ఏడుపొస్తూంది" అంటూ రాధని కౌగిలించుకున్నాడు. దుఃఖాన్ని దిగమింగుకుంది రాధ. రాధ తలలో ఎన్నో అనుమానాలు" మళ్ళీ... మళ్ళీ యిదంతా యిలాగే జరగొచ్చునేమో. నాకు భయంగావుంది..." అంది.

"నాకూ భయంగానే వుంది రాధా. కాని జీవితమే భయంకరమైంది. దీనికింకో దారిలేదు. నిన్ను నేను శాశ్వతంగా వదులుకోలేను," అన్నాడు.

"నేనూ, నా వ్యక్తిత్వం వదులుకోలేను. నేనూ ఉద్యోగం మానను. నేనూ ఓ మనిషినని యిప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను. అందుకే మళ్ళీ... భయంగా వుంది," అంది రాధ.



"ఇద్దరం కలిసి ప్రయత్నిద్దాం రాధా మనకోసం...మన పిల్లలకోసం... రా, రాధా నిన్ను యింటికి తీసుకువెడతాను."

రాధ లేచింది.. కృష్ణమూర్తి మళ్ళీ చేతులు చాపాడు. అతని కౌగిట గువ్వలా యిమిడిపోయింది రాధ.

హాల్లో లైటు వెల్గడం చూడలేదు యిద్దరూ.

''సారీ, తలుపు తీసివుంది" అంటూ లైటు ఆర్పేశాడు అప్పుడే లోపలికివచ్చిన కృష్ణమూర్తి బావగారు. 'ఫరవాలేదు, లైటు వేయండి... మేమూ యిప్పుడే బయలుదేరుతున్నాం'' అంటూ రాధ చేయి తన పిడికిట బిగించాడు కృష్ణమూర్తి.

రాధ కళ్ళు కడిగిన ముత్యాల్లా మిలమిల లాడుతున్నాయి.

"నేను యింటికి వెడుతున్నాను," అంటూ హాలుదాటి వీధిలోకి వచ్చాడు కృష్ణమూర్తి.

"రేపు ఉదయం లాయ రొస్తాడు" సాగనంపుతూ బావగారు హెచ్చరించాడు.

"అక్కర్లేదు. మేం విడిపోవడం లేదు," అనేసి కారు స్టార్టుచేశాడు కృష్ణమూర్తి.

సన్నగా వర్షం పడుతోంది.

ఆ చీకటిరోడ్డుమీద కారు సాగుతూంటే మూసివున్న కిటికీలలోంచి కనపడుతున్న వెలుతురు వెచ్చగా తోస్తూంది.

కాని రోడ్డుమటుకు - మోసంచేసేటంత జారుడుగావుంది. 'జాగ్రత్తగా యీ బాటవెంట నడవకపోతే ప్రమాదం తప్పద'న్న నిజం రాధకీ, కృష్ణమూర్తికీ ఒక్కసారే తోచింది. ఒకరికేసి ఒకళ్లు ఒకరి కళ్లలోకి ఒకళ్లు చూసుకుని నవ్వుకున్నారు. రాధకాస్త దగ్గరగా జరిగింది. కృష్ణమూర్తి భుజానికి తలాన్చి నిట్టూర్చింది. 'నిజం! యీ సన్న వాన మరీ చితచిత! జాగ్రత్తగా నడపండి' అంది.